# పి. చంద్రశేఖర అజాద్

నవల





# అహానికి రంగుండదు

# అహానికి రంగుండదు

పి. చంద్రశేఖర అజాద్

**A.R.** బుక్స్
గుడివాడ, హైదరాబాద్

# అహానికి రంగుండదు

**పి. చంద్రశేఖర అజాద్ నవల**

**అన్ని హక్కులు రచయితవి**

*E-NOVEL*

**'కినిగె' నవలల పోటీకోసం**

**ముఖం చిత్రం : తాతా** రమేష్‌బాబు

**వెల :** ₹ 100

**<u>రచయిత చిరునామా :</u>**

**P. చంద్రశేఖర అజాద్**
F. No. 909. Sapphire Block
My Home Jewel
Madinaguda, Miyapur
**Hyderabad - 500 049**
Cell : 92465 73575

# ప్రస్తావన

ప్రకృతిలో ఎన్నెన్నో రంగులున్నాయి.

మనుషుల్లోనూ అనేక వర్ణాల వారున్నారు. ప్రపంచ దేశాలన్నింటికీ జాతీయ పతాకాలున్నాయి. వాటికి రంగులున్నాయి. మతాలకు రంగులున్నాయి. ఆదర్శాలకు, భావాలకు, సిద్ధాంతాలకు, కంటికి కనిపించని వాటికి రంగులున్నాయి. వాటిని సింబాలిక్‌గా చూపిస్తున్నారు.

అలాంటప్పుడు 'అహానికి రంగుండదు' అనటం సరయిందా? ప్రేమ-ఆకలి, ఆధ్యాత్మికం - విప్లవం, మోక్షం ఇలా పరస్పర విరుద్ధంగా వున్న విషయాలకి రంగులు పులమటం వెనుక భౌతికమైన మెదడు నుండి పుట్టే ఆలోచనలు కారణం కావచ్చు.

మిగతా అంశాల్లో ఆయాసందర్భాల్లో వ్యక్తులు భిన్నంగా ప్రవర్తించవచ్చు. 'అహం' విషయంలో మాత్రం అలా కాదు. ఏ రంగులకు చెందిన వారయినా 'అహానికి' అతీతులుకారు. ఏ సిద్ధాంతమైనా తమలో చీలికలకి కారణంగా ఏమైనా చెప్పవచ్చు. నమోదు కానివి వ్యక్తిగత అహాలు. మనుషులూ - సంస్థలూ - దేశాలు- రంగులకి ప్రతీకలయిన చోట 'అహానికి రంగుండదు' అనడం అందుకే.

❉ ❉ ❉

ఎపుడూ అలానే ఉంటుందా? మనుషులు వెనక్కి తిరిగి చూసుకోరా? మనుషుల అంతరంగాలు ఆవిష్కరింపబడవా? రహస్యాలు అలా అవర్ణంగా ఆవిరవుతాయా?

శరీరావయవాల మీద మనసు, మనసు మీద బుద్ధి, బుద్ధిమీద 'అహం' 'ఆర్థికం' అధికారం చెలాయించటం, వాటిని ఆత్మశాశించటం వెనకవున్న కోణాన్ని విశ్లేషించే ప్రయత్నం మనలోకి మనం తొంగి చూసుకునే క్రమంగా చదివి, అనుభూతి చెంది, విశ్లేషించమని మనవి.

❉ ❉ ❉

**కథాకాలం :** *1960 దశకం నుండి నాలుగు దశాబ్దాలు.*

# అహానికి రంగుండదు

**"రెండు** తొడకండరాల మధ్య రాపిడికోసం నువ్వు తపిస్తున్నావు. అంతకు మించిన స్వర్గం లేదనుకుంటున్నావు."

"నీకు గుర్తుందా! ఒకప్పుడు 'మానవేంద్ర' నాకు రెండు చొక్కాలు ఇచ్చాడు. అవి నేను తొడుక్కున్నాను. అపుడు నువ్వేం అన్నావో నీకు గుర్తు చేస్తున్నా."

"ఒకరు తొడుక్కుని వదిలేసిన బట్టలు వేసుకున్నావంటేనే నీకు సిగ్గూ, అభిమానం లేవు. అవుంటే ఆ పనిచేయవు."

"అవును నేను అతనిచ్చిన చొక్కాలు వేసుకున్నాను. అందుకు కారణం నా పేదరికం. అది నేను కోరుకున్నది కాదు. ఇప్పుడు నువ్వు చేస్తున్నదేంటి?"

"ఇంట్లో భార్య వుండగా నువ్వు వీధిన పడ్డావు. నువ్వు అనుభవిస్తున్న స్త్రీలు ఎంతమంది మధ్య నలిగిపోయారో నీకు తెలుసు. అంటే సిగ్గూ, అభిమానం లాంటివన్నీ నువ్వు వదిలేసావు. వారు సైతం నీ మీద ఇష్టంతో ఈ పనిచేయటం లేదు. బతుకు తెరువు కోసం హృదయాన్ని ముక్కలు చేసుకున్నారు. వారు అనుభవిస్తున్న రాక్షస రతిలో నువ్వూ ఓ భాగం అయ్యావు."

"నీకు రోజుకో రుచి, వారానికో ఆడది కావాలి. ఈ ఏర్పాట్లు చేయటానికి నీకు మనుషులు కావాలి. అసలు నీ దినచర్య ఏంటి?"

మద్యంతో ముఖం కడుక్కుంటావు. అల్పాహారం చేస్తావు. ఓ ఆల్కహాలికుడా - రాత్రి నిన్ను నువ్వు కోల్పోయేంతవరకూ మద్యం మద్యం మద్యం. ఇంకా స్త్రీ పట్ల నీ వ్యామోహం చావలేదు. ఇదా బతుకంటే! ఇదీ బతుకేనా? మత్తులో, భ్రాంతిలో కూరుకు పోయిన నీ ముందు నిలబడి చాలా మాట్లాడాల్సి వుంది. నువ్వంటే నిన్నటి భయాలు నాకులేవు. ఒకప్పుడు నువ్వేంటి? నీ స్థాయి ఏంటి? నీ పరిచయాలేంటి? నీ ఆచరణేంటి? నువ్వు ఎవరితో వున్నావు! నీ పక్కన ఏ వ్యక్తులున్నారు?

ఇప్పుడు నీ పక్కన ఎవరున్నారు. నీ స్నేహితులెవరు? నీ చెంచాలు ఎవరు? అసలు నీ సర్కిల్ ఏంటి? ఎప్పుడయినా నీకు ఈ ఆలోచన వచ్చిందా?

ఇప్పుడంటున్నాను. ఈ ప్రపంచంలో నువ్వు పతనమైనవారిలో మొదటి వాడివి కాదు. నీతోనే ఈ పతనం అంతంకాదు. నీకు నేను గొప్పవాడ్ని అనే అహంకారం. నేను తెలివిగలవాడ్ని. నేను డబ్బు సంపాదించగలను. నా దగ్గర తర్కం వుంది. నేను ఏం చేసినా అది సరయింది అనుకుంటున్నావు. నువ్వు ఆస్తులు సంపాదించావు కాబట్టి, ఈ ప్రపంచం డబ్బు చుట్టూ తిరుగుతోంది కాబట్టి నిన్ను ప్రశ్నించే దమ్ము ఎవరికీ లేదు అనుకుంటున్నావు.

నేనేం చేసినా చెల్లుతుందనుకుంటున్నావు. అది ఎల్లకాలం ఎవరి విషయం లోనూ చెల్లదు. మనుషులు మారతారు. ఇప్పటికీ మించిపోయింది లేదు. వెనక్కి తిరిగి చూసుకో. ఆత్మ విమర్శ చేసుకో. నువ్వింకా నడివయసులోనే వున్నావు. బతుకుని దూరం చేసుకోవద్దు. నేను ఇలా రాస్తున్నందుకు నీకు నామీద ఎంత ఆగ్రహం వస్తుందో నాకు తెలుసు. ఆ తీవ్రతలో నేను ఎదురుగావుంటే నా గొంతు పిసికి చంపేసేవాడివి.

నీకు విచక్షణ లేకపోవటం ఈనాటిది కాదు. ఇప్పుడు కూడా నీకు అలాంటి ఆలోచన వస్తుందని నాకు తెలుసు. నువ్వు నన్ను చంపగలవు.

నా ప్రశ్నల్ని చంపలేవు. ఇన్ని సంవత్సరాల నీ బతుకుతీరుని బూడిద చేయలేవు.

ఈ రెండూ నిన్ను వెంటాడుతుంటాయి. నన్ను పిలిచింది నీ సమస్య కోసం. అంతటితో ఆగలేదు. మీ ఇద్దరి సమస్యకి పరిష్కారం నన్ను చెప్పమంటున్నావు. నిర్ణయం తీసుకోవాల్సింది మీ ఇద్దరు. ఇందులో నాకుగాని, నా కుటుంబ సభ్యులకిగాని ఎలాంటి సంబంధం లేదు. కమల నిర్ణయం తీసుకున్నాక అపుడు మేం నిర్ణయించుకుంటాం ఏం చేయాలో. అంతేగాని కమల ఒంటరిది కాదు. నీ బలం మాకు లేకపోవచ్చు. కానీ మౌనంగా వుండటం జరగదు. ఇప్పటికి ఇక్కడ ఆగిపోతాను.

విసిరికొట్టానా ఉత్తరాన్ని. వీడికి ఎంత ధైర్యం. మళ్ళీ వాడిలో నిన్నటి మనిషి నిద్ర లేచాడు. ముందీ ఉత్తరాన్ని ముక్కలు ముక్కలు చేసి దానిమీద 'మందు' పోసి తగలేస్తాను.

ఆ తర్వాత...

ఇప్పటికి సగం బాటిల్ తాగేసాను. వాడ్ని చంపటం పెద్ద విషయం కాదు. అందుకు నేను కల్పించుకోనవసరం లేదు. వాడేం రాజకీయ నాయకుడు కాదు. తత్వవేత్త కాదు. ఏ రకంగానూ ప్రముఖుడుకాదు.

చిన్న ఉద్యోగం చేసుకుంటూ చాలీచాలని జీతంతో బండి నెట్టుకొస్తున్నాడు. ఇద్దరు ఆడపిల్లల తండ్రి. వాళ్ళ పెళ్ళిళ్ళు చేయాలంటే నా దగ్గరకు రావాల్సిందే. ఆ రోజు వస్తుంది. అలాంటివాడ్ని చంపటమా!

చిన్నప్పటి నుంచి వాడికి అహంకారం వుంది. ఆ చూపులోనే ఏదో వుంది. మొదటిసారి వాడ్ని చూసినప్పుడే నాకు వాడి మీద అసూయ కలిగింది.

వాళ్ళ నాన్న చనిపోయాడు. నేను వెళ్ళేసరికి అందరూ ఏడుస్తున్నారు. వాడి కళ్ళ వెంట నీళ్ళుకారి ఎండిపోయిన చారికలు కనిపిస్తున్నాయి. ఒకప్పటి గొడ్ల చావిడి. అందులో వాడి నాన్నని పడుకోబెట్టారు. వాడు అప్పటికే పోగయిన జనాన్ని చూస్తున్నాడు. మధ్యలో వాళ్ళ నాన్నని చూస్తున్నాడు. ఏం ఆలోచిస్తున్నాడో తెలియదు. ఆ ముఖంలో రకరకాల భావనలు కనిపిస్తున్నాయి.

నాకు వాడిని చూస్తుంటే జాలి కలగలేదు. వాడు మరింతగా మరింతగా కుళ్ళికుళ్ళి ఏడిస్తే బాగుండుననిపించింది. నన్ను చూడగానే దగ్గరకు రాలేదు. నా చేతులు పట్టుకోలేదు. నువ్వే మాకు దిక్కు అనలేదు. ఆ మాట జనం అన్నారు, అంటున్నారు. అప్పటికీ వాడు నాకేసి చూడటం లేదు. ఎటోచూస్తాడు. అప్పుడు వాడికి ఆకాశంలో పరుగులు తీస్తున్న మబ్బులు కనిపిస్తున్నాయి. అందులో నాన్నని వెతుక్కుంటున్నాడా? అయినా మృత్యువు గురించి వాడికి తెలిసే వయసూ కాదు. అప్పుడు వాడికి ఏడు సంవత్సరాలు. ఏడు సంవత్సరాలకే జ్ఞానం వచ్చేంత మేధావికాదు. ఆ జీన్స్ వాడిలో వున్నాయని నేను అనుకోను. వాడు అప్పటికీ, ఇప్పటికీ ఏ ప్రత్యేకత వున్నవాడు కాదు. ఈ భూమండలం ఆవిర్భవించాక పుట్టి, గిట్టిన శతసహస్ర మనుషుల్లో ఒకడు. అయినా ఇప్పుడు వాడు మాట్లాడుతున్నాడు. ఒకప్పుడు నా ముందుకు రావటానికి దడుసుకు చచ్చేవాడు. ఒకప్పుడు నా దగ్గర పనిచేసిన వాడు ఇప్పుడు నన్ను 'నువ్వు' అని రాసేంత పెద్దవాడయ్యాడు. నేను ఓ లక్షరూపాయలు నావి కాదనుకుంటే వాడు ఈ ప్రపంచంలో వుండడు. అంతకూడా అవసరం లేదు వాడ్ని తీసేయటానికి ఓ క్వార్టర్ బాటిల్, బిర్యానీ పొట్లం చాలు.

వాడు అంటున్నాడు నువ్వు నన్ను చంపగలవు, నా ప్రశ్నల్ని చంపలేవు. అవి నిన్ను వెంటాడుతుంటాయి. అవును చిన్నప్పటి నుంచి వాడు నన్ను వెంటాడుతూనే వున్నాడు. వాడు మాత్రమేకాదు, వాడి అక్క కూడా. నేను చాలా సాధించాను. చాలామందిని భయపెట్టాను. నేను అనుకున్నవన్నీ జరిగాయి.

ఒక్క వీళ్ళ విషయంలోనే నా అంచనాలు తలకిందులయ్యాయి. చాలా మాట్లాడాలంటున్నాడు కదా మాట్లాడిస్తా. నా అనుభవం ముందు, నా తర్కం ముందు వాడి ఆక్రోశాలు, ఆవేశాలు మసి అయిపోవాలి.

అయినా నేను మనుషుల్ని చంపే హంతకుణ్ని కాదు. అలాంటి ఆలోచనలు ఈ మధ్యకాలంలో వచ్చాయి. 'వీడి' విషయంలో కాదు, ఇంకొందరి విషయంలో. అప్పుడు నేను అనుకున్నాను పతనం అవుతున్నానా అని. నా పతనానికి కారకులయిన వారిని ఏమీ అనలేని నేను ఇంకెవరినో ఏదో చేయాలనుకోవటం దారుణం అనిపించింది. ఒకప్పుడు నాకూ కన్నీళ్ళు వున్నాయి. నాకూ ఆవేశం, ఆరాటం వున్నాయి. వాటిని మించిన ఆశయం వుంది. అవన్నీ ఇప్పుడు వాడు నాకు గుర్తు చేస్తున్నాడు. ఇన్ని దశాబ్దాల తర్వాత వాడు తేనెతుట్టెని కదిపాడు. నేను మౌనంగా వుంటే కాదు. ఓటమి అంటే నాకు అసహ్యం. అంతగా అయితే నేను నా ఏకాంత మందిరంలో ముడుచుకు పోతాను. నేను యుద్ధం చేయటం మానేసి చాలాకాలమైంది. ఇప్పుడు నన్ను ఇంతగా కుదిపేసిన వాడి పేరు అజయ్. వాడు నా బావమరిది.

❊ ❊ ❊

"పోయినోల్లందరూ మంచోళ్ళు. ఉన్నోళ్లు పోయినోల్ల తీపి గురుతులు" అని పాట వినిపిస్తోంది.

అజయ్ ఆ పాటవింటూ నవ్వుకున్నాడు.

"ఎందుకు నవ్వుతున్నారు?" అంది అతని భార్య నీలిమ.

"ఉన్నోళ్లంటే ఎవరని అనుమానం వచ్చింది."

"బతికి వున్నవారని" అందామె.

"నేను డబ్బులున్నవాళ్లేమో అనుకున్నా" అన్నాడు అజయ్.

నీలిమ మొగుడివైపు విచిత్రంగా చూసింది.

"కవులకి అంత హృదయం వుండటం మంచిది కాదు. ఉన్నవాళ్లు తీపి గురుతులు అని ఎందుకు అనుకోవాలి. చేదు గుర్తులు, వగరు గుర్తులు ఎందుకు కాకూడదు."

"అది పాట"

"పాటయితే తీర్పులు చెప్పేయటమేనా!" అన్నాడతను సీరియస్‌గా. నీలిమ అజయ్‌ని అర్థంకానట్లు చూసింది.

"ఒకప్పుడు ఈ పాటంటే మీకు ఇష్టం అని చెప్పారు. పాటలు తీర్పులు ఎలా అవుతాయి. ఒకప్పుడు మనసున్న వాళ్ళకి సుఖం లేదు అంటారు. ఇంకోసారి మనసు లేని వారు అసలు మనుషులు కాదంటారు" అంది. అజయ్ చిన్నగా నవ్వాడు.

"మీలో ఈ మధ్య మార్పు కనిపిస్తోంది" అంది కాస్త ఆందోళనగా.

"విష్ణుగారికి ఉత్తరం రాసాననా. అది ఇప్పుడు కొత్తగా వచ్చింది కాదు. నాకు అక్షరాలు రాయటం వచ్చిన దగ్గర్నుంచి చేస్తున్న పని అదే. నా ఉత్తరాలు చాలామందిని బాధపెట్టాయి. ఇంకొంతమందిని సంతోషపెట్టాయి. ఉత్తరం రాయకముందు, రాసాక నేను ఎంత ఘర్షణ పడతానో నాకు తెలుసు" అన్నాడు అజయ్.

"అంత ఘర్షణ పడుతున్నానని తెలిసినప్పుడు రాయటమెందుకు?" అంది నీలిమ.

"సంతోషం కుదిపేసినప్పుడు, బాధతో విలవిలలాడినప్పుడు మాత్రమే ఉత్తరాలు రాస్తారు. ప్రేమలేఖలూ, సౌందర్యాన్ని గురించిన లేఖలూ రాసే స్థితికాదు నాది" అన్నాడు శూన్యంలోకి చూస్తూ.

నీలిమ మాట్లాడలేదు.

అజయ్ ఆలోచిస్తున్నాడు.

"టీ ఇమ్మంటారా?" అంది

"అవసరం లేదు. నాకు పోయినోల్లందరూ మంచివాళ్ళు అనటం కూడా నచ్చలేదు"

"ఇప్పుడా - ఇది వరకు కూడానా?"

"అప్పట్లో అనుమానం. పోయింది మానాన్న కాబట్టి నిజమే అనిపించింది. అనుభవం వస్తున్నాక పోయినోల్లంతా మంచివాళ్ళు ఎలా అవుతారు అనుకున్నాను. 'చావు' వాళ్ళ చెడునంతటినీ 'మంచి' చేసేస్తుందా. ఇలాంటి పాటల వల్లే మనుషులు చెడిపోతున్నారు."

"అలా అంటారెందుకు? చనిపోయినవారి గురించి చెడుమాట్లాడటం మంచిది కాదంటారు పెద్దలు'' అంది నీలిమ.

"చనిపోయినవారి గురించి చెడు మాట్లాడకూడదు. బతికివున్నవారు వాళ్ళ తీపిగుర్తులు. అందుకే మనం ఎన్ని నీచమైన పనులు చేసినా, చనిపోయాక మన గురించి మంచే చెబుతారు అనే నిర్ణయానికి జనం వచ్చారు. అప్పట్నుంచి మంచి చేయటం ఆగిపోయింది'' అన్నాడు.

"ఇప్పుడు మనమధ్య ఈ చర్చ ఎందుకు. మార్కెట్‌కి వెళ్లి కూరలు తీసుకురండి. ఆదివారం కదా చికెన్ తీసుకొస్తారా?''

ఆ మాట వినగానే అజయ్ కళ్ళు చిన్నవయ్యాయి.

'నీలిమ'కి అర్థం కాలేదు.

"ఒకప్పుడు నేనూ మా తమ్ముడూ ఓ కోడిపిల్లను ఎంతో ప్రేమగా పెంచుకున్నాం. అప్పుడు విష్ణు వచ్చాడు. వారానికి అయిదు రోజులు కోళ్ళో, చేపలో తింటాడు. అయినా 'వారికి' తృప్తి లేదు. అప్పుడు ఆ రాత్రి మా ఊర్లో షాపులు వుండేవికాదు. మేం పెంచుకున్న ఆ కోడిపిల్ల అరకోడిగా తయారైవుంది. మా ఇష్టానికి వ్యతిరేకంగా దాని గొంతుమీద కాలుతో తొక్కి చంపేసాడు. తమ్ముడితో దాని బొచ్చుపీకించి, దగ్గరుండి తనేకాల్చాడు. మా అమ్మ వండిపెట్టింది. మహదానందంగా తిన్నాడు'' అని గుర్తు చేసుకున్నాడు.

"ఇప్పుడా విషయాలన్నీ ఎందుకు తవ్వుతున్నారు?''

"కడుపు మండిన వాడ్ని కాబట్టి'' అన్నాడు.

"మంచి జ్ఞాపకాలుంటే చెప్పండి''

"ఆ మనిషితో నాకు మంచి జ్ఞాపకాలులేవు. అతన్తో నాకు ఎప్పుడూ యుద్ధమే'' అన్నాడు అజయ్.

"సరే ముందు మార్కెట్‌కి వెళ్లిరండి. చికెన్ మీకు ఈ రోజు తినాలనిపించకపోతే కూరగాయలు తీసుకురండి'' అంటూ వెళ్లి సంచి తీసుకువచ్చింది. బయటకి అడుగువేయబోతూ ఆగిపోయాడు.

'విష్ణు' నిలబడి వున్నాడు.
అంటే నేను. నేను వచ్చి ఎంతసేపయిందో తెలియదు అజయ్‌కి.

❄ ❄ ❄

విశాఖపట్టణం. సముద్రతీరం కనిపిస్తోంది - గెస్ట్‌హౌస్ నుండి చూస్తుంటే. టెర్రస్ మీద కూర్చున్నాం. నా ఎదురుగా అజయ్ వున్నాడు. నన్ను చూసాక అజయ్ కాస్త ఆశ్చర్యపడ్డాడు. నీలిమ మాత్రం కంగారు పడిపోయింది. అంతకు ముందు ఒకటి రెండు సందర్భాల్లో ఆ అమ్మాయిని చూసాను దూరం నుండి. అది కూడా ఏ పెళ్ళిలోనో - మరో సందర్భంలోనో! అజయ్‌గాడి పెళ్ళికి నేనూ - సత్యం కలిసి కారులో వెళ్లాం. అసలు ఈ పెళ్ళి చేస్తున్నామని నాకు ముందుగా చెప్పలేదు. అజయ్‌కి వేలువిడిచిన మేనమామ అవుతాడాయన. మా అత్తగారు వచ్చి చెప్పింది. తర్వాత ఆయన వచ్చాడు.

అప్పటికి అజయ్‌గాడికి ఉద్యోగం లేదు. అంతకుముందే నా దగ్గర నుండి వాడు వెళ్లిపోయాడు. ఆ తర్వాత నన్నెప్పుడూ కలవలేదు. ఈ పెళ్ళికి నా భార్యని మాత్రం పంపించాలనుకొన్నాను. సత్యం బలవంతం చేసాడు.

'ఇప్పటికే నీ మీద వ్యతిరేకత వుంది. ఇలాంటప్పుడు వెళ్లకపోతే నీ గురించి ఇంకా చెడుగా మాట్లాడుకుంటారు. అయినా నువ్వు వాడికోసం రావటం లేదు. నీ 'మావ' కోసం వస్తున్నావు'' అన్నాడు. నేను సమాధానపడలేకపోయాను.

'అసలు శ్రీరాములు కూతుర్ని నువ్వు ఎందుకు చేసుకున్నావు' అన్నాడు సత్యం. నేను షాకయ్యాను. 'శ్రీరాములు చనిపోయినప్పుడు అతని మీద ఎర్రజెండా ఎందుకు కప్పావు' అన్నాడంతలోనే.

అప్పుడు జనం అన్నమాటలు గుర్తొచ్చాయి.

"విష్ణుగారూ! పెద్ద ఆడపిల్ల పెళ్ళిచేసి శ్రీరాములుగారు చనిపోయారు. ఇంకా నలుగురు పిల్లలున్నారు. చిన్నవాళ్ళు. ఆయన తనకంటూ ఏమీ మిగుల్చుకోలేదు. ఉన్నదంతా అమ్మి ప్రజల కోసం పనిచేయాలనుకున్నాడు. అలాంటి మంచి మనిషిని, నిజాయితీపరుడ్ని అరుదుగా చూస్తాం. ఇప్పుడా కుటుంబానికి మీరే దిక్కు. ఇద్దరు మగపిల్లలు, ఇద్దరు ఆడపిల్లలు. ఒకమ్మాయిది పెళ్ళీడు. అజయ్‌కంటే మూడు సంవత్సరాలు పెద్దది రెండో అమ్మాయి. మూడు సంవత్సరాలు చిన్నవాడు తమ్ముడు. ఇక నుండి వారి బాధ్యత మీరే చూసుకోవాలి.'' అప్పుడు నేను చిన్నగా తలూపాను.

'కమల'ని నేను చేసుకోవటం మా ఇంట్లో ఎవరికీ ఇష్టం లేదు. నాకు మేనమామ కూతురుంది. అది పుట్టినప్పుడు మా అత్త తీసుకువచ్చి చూపించి 'నీకు పెళ్ళాం పుట్టిందిరా' అంది. నాకు ఆ వయసులో అదో గొప్ప అనుభూతి.

వాళ్ళకి చాలా ఆస్తులున్నాయి. మాకంటూ ఓ రెండెకరాల భూమి మాత్రం వుంది. మానాన్న అందులో కూలీలతో పాటు స్వయంగా వ్యవసాయం చేసేవాడు.

నా మేనమామ కూతురు యుక్తవయసు వచ్చేసరికి చాలా మారిపోయింది. తను ఎప్పుడూ రకరకాల నగరాలు తిరిగేది. అప్పటి మద్రాసులో చదువుకుంది. ఎప్పుడన్నా ఇంటికి వచ్చినప్పుడు నేను వెళ్లి కలుసుకునే వాడిని. నన్ను అసలు లెక్క చేసేదికాదు. తన దృష్టిలో నేను పల్లెటూరి బైతుని. అప్పటికి నేను చదువుకుంటున్నా వ్యవసాయపు పనులు చేసేవాడ్ని.

మా అమ్మ నా పెళ్లి నా మేనకోడల్తో చేయాలని చాలా తాపత్రయ పడేది. మా అత్త చిన్ననాటి మాటల్ని గుర్తు చేసేది. నేను చాలా సంవత్సరాలు నా మేనకోడలు గురించి కలలుగన్నాను. తన పేరు 'లహరి.' అద్భుతమైన సౌందర్యవంతురాలు. లహరిని చూస్తుంటే నాకు ఓ 'మధుబాల' 'నర్గీస్' లాంటివారు గుర్తొచ్చేవారు. మా ఊరు వచ్చినపుడు పది రోజులు వుండటానికి చాలా ఇబ్బందిపడిపోయేది. ఎప్పుడెప్పుడు వెళ్దామా అని చూసేది.

మా ఊరు పచ్చటి చేలతో, కొబ్బరి చెట్లతో కనువిందుగా వుండేది. అక్కడ మా బంధువొకాయన వుండేవారు. ఆయనకు వేదాలు, ఉపనిషత్తులతో పరిచయం వుండేది.

దీక్షితులు గారుండేవారు.  ఆయనకి ఆయుర్వేద వైద్యం గురించి తెలుసు. నామమాత్రం డబ్బులు తీసుకొని వైద్యం చేస్తుండేవారు. మా ఊరిలో గ్రంథాలయం ఏర్పాటు కావటానికి మా బంధువు కారణం. అన్నీ పాత పుస్తకాలుండేవి. ఎక్కువ ఆధ్యాత్మిక పరమైన పుస్తకాలు, కొన్ని నవలలుండేవి. అవన్నీ చదివేసాను.

అప్పట్లో నాకు చాలా సందేహాలు వస్తుండేవి. మా ఊరి మాలపల్లి, దళితులు, అగ్రవర్ణాలవారు, ముస్లిములు అందరూ కలసి బతుకుతున్నా, పెద్దగా ఘర్షణలు లేకపోయినా వారందరి మధ్య ఏవో అంతరాలున్నట్లు అనిపించేది. అవి ఒక్కోసారి పైకి కనిపించేవి మిగతా సమయాల్లో అదృశ్యంగా వున్నట్లు అనిపించేవి.

మా మామవరసయ్యే రఘురామయ్య - దీక్షితులుగారు ఇలాంటి విషయాల్ని పెద్దగా పట్టించుకునేవారు కాదు. మా ఊర్లోనే పెద్దషావుకారు వుండేవాడు. ఆయనపేరు అదే. ఎప్పుడూ బుల్లెట్ మీద తిరుగుతుండేవాడు. అప్పుడప్పుడూ తెల్ల అంబాసిడర్ కార్లో వచ్చేవాడు. అసలు పేరు నేను ఎప్పుడూ వినలేదు. ఆయనకి పొలాలతోపాటు రకరకాల వ్యాపారాలున్నాయి.

ఆయన ముందు దళితులు ఎంత ఒదిగివుండేవారో. అగ్రవర్ణాల పేదలు కూడా అంతలా చేతులు కట్టుకు నిలబడేవారు. ఆయన రాజకీయాల మీద ఎప్పుడూ శ్రద్ధ చూపించలేదు. కాకపోతే ఆయన ఎవరు చెబితేవాళ్ళు ఎన్నికల్లో నిలబడేవారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలప్పుడు ఆయన చెప్పినవారికి చాలావరకు ఓట్లు పడేవి.

అప్పట్లో నాకల 'బుల్లెట్' మీద తిరగటం. అంతేకాదు నేను సైతం ఓ ఏభై ఎకరాలు సంపాదించాలి. వీలయితే పెద్దషావుకార్ని అధిగమించాలి. అదంత సులభం కాదని నాకు తెలుసు. మా వ్యవసాయం ఎప్పుడూ దినదినగండమే. నాలుగు సంవత్సరాలు బాగుంటే తర్వాత అతివృష్టి, అనావృష్టి. రఘురామయ్య - దీక్షితులగారితో నేను సుదీర్ఘంగా చర్చలు చేసేవాడ్ని. ఓపట్టాన తేలేవి కావు.

"నువ్వు యువకుడివి కాబట్టి ఇప్పట్లో ఇలానే మాట్లాడతావు. ముందు ముందు నీ అనుభవాలే నిన్ను మార్చుతాయి" అనేవారు.

నేను నా ఎదుగుదలకి 'లహరి'ని సాధనంగా ఎంచుకున్నాను. అప్పటికి లహరికి వారి అమ్మా-నాన్నల కుటుంబాల నుండి పిల్లలు లేకపోవటంతో మరికొన్ని ఆస్తులు వచ్చి చేరాయి. ఆ రకంగా లహరి మా ఊరిలో సంపన్నురాలైంది. 'పెద్దషావుకారు' తర్వాత లేదా సమాన స్థానం లహరిదే.

నా పదిహేడో సంవత్సరం నా జీవితంలో మరిచిపోలేనిది. అప్పుడే అత్యంత కీలకమైన మలుపులు సంభవించాయి. మా 'లహరి' వాళ్ళ కొబ్బరి తోటలో చిన్న దొరువు ఉంది. అందులో కలువపూలు వుండేవి. దొరువు మధ్యలో ఎర్రకలువ ఒకటి మెరిసేది.

ఆ రోజు 'లహరి' ఎర్రకలువకేసి చూస్తూ ఏదో లోకంలో వుంది. అప్పటికి వాళ్ళ అమ్మ చనిపోయింది. నేను 'లహరి'ని వెతుక్కుంటూ వచ్చి ఆమె పక్కన కూర్చున్నాను, కాస్త ఎడంగా. నాకేసి మౌనంగా చూసి మళ్లీ ఎర్రకలువని చూస్తోంది.

"అది నీకు కావాలా" అన్నాను.

తల అడ్డంగా వూపింది. తర్వాత మా మధ్య మాటలు లేవు. తను ఏమన్నా మాట్లాడినా, కనీసం చిరునవ్వు నవ్వినా నాకు గలగలా మాట్లాడాలనుంది. అలాంటిదేంలేదు. ఈ రోజు ఏదొకటి తేల్చుకోవాలనే ఆరాటంలో వున్నాను.

నా ఒంటి నుండి వెచ్చటి ఆవిర్లు రావటం నాకు తెలుస్తూనే వుంది. ఇంక నేను ఉద్విగ్నత భరించలేక 'లహరి' చేతిని అందుకున్నాను. ఉలిక్కిపడింది. నాకేసి కాస్త కోపంగా చూసింది. మెల్లగా చేతిని వదిలేసాను. తలదించుకుని -

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=2649**

* * *